బంధం-సంబంధం

రాజారావు ఆఫీసుకి వెళ్ళడానికి ముందుగదిలో బూట్లు వేసుకొంటూ వుంటాడు. కర్చీఫ్, పెన్ను భర్తకి అందించడానికి అక్కడికి వచ్చిన శారద వాటిని భర్తకివ్వడం మరచిపోయి, ఎదురు వాటాలోంచి వినిపించే మాటల్ని వింటుంది. భార్య అన్యమనస్కాన్ని గమనించి రాజారావు కూడా ఎదురింటివైపు తన దృష్టిని మరలుస్తాడు.

ఎదురింట్లో—ఈశ్వర్ ఆఫీసుకి బయల్దేరడానికి సిద్ధమవుతాడు. కానీ బాగ్‌నందించడానికి వచ్చిన భార్యని చూసి ఆఫీసుకిపోనని భీష్మించు క్కూర్చుంటాడు. "ఉహూ .. ఇవాళ నేను ఆఫీసుకెళ్ళను. నీ దగ్గరే వుండి పోతా." ఈశ్వర్ గారాం పోతున్నాడు.

"బావుంది. ఆఫీసుకెళ్ళకుండా ఎవరైనా పెళ్ళాం కొంగు పట్టుకు తిరుగుతారేమిటి?" అంటోంది భార్య.

"అందరి సంగతి వేరు - నా బంగారు బొమ్మ సంగతి వేరు. నీకున్న అందం ఎంతమందికుంటుంది?"

"మీరు మాత్రం సినిమా హీరోలా లేరూ?"

ఇద్దరి నవ్వులు విరుస్తాయి. మయూరి, ఈశ్వర్ని బలవంతాన ఆఫీసుకి బయల్దేరదీస్తుంది. వాళ్ళు బయటికి రావడంతో వులిక్కిపడి భార్య చేతిలోంచి కర్చీఫ్, పెన్ను లాక్కుంటాడు రాజారావ్. వెనక్కి తిరిగి బైబై చెప్తూ వెళ్తాడు ఈశ్వర్. అతని వెనుకే భార్యకి వెళ్తున్నానని కూడా

చెప్పకుండా బయల్దేరతాడు రాజారావు. అతను తనకి బైబై చెప్తాడని ఆశగా గుమ్మంలలోకి వచ్చిన శారదకి నిరాశ ఎదురవ్వడమే కాకుండా మయూరి తనని గమనించనుకూడా గమనించకుండా భర్తకు టాటా చెప్తూ చేతులు చూపుతూ నిల్చోవడం బాధని కలిగిస్తుంది. చటుక్కున లోపలికి వచ్చేస్తుంది.

*　　　　*　　　　*

సరిగా ఆయిదున్నర కొట్టేసరికల్లా ఈశ్వర్ ఇంటికొచ్చి కాలింగ్ బెల్ మోగిస్తాడు. వాళ్లు లోపలికి వెళ్ళిపోగానే శారద గుమ్మంలోకి వచ్చి నిల్చుని భర్తకోసం ఎదురుచూస్తుంటుంది. రాజారావ్ వస్తున్న జాడ ఎక్కడా లేదు. ఇంతలో ఎదురు వాటా తెలుపు తీస్తున్న శబ్దం. లోపలికి వచ్చి కర్టెన్ సందుగుండా చూస్తుంటుంది. ఇంటికి తాళం వేసి ఇద్దరూ చిలకా గోరింకల్లా బయటికి వెళ్ళిపోతారు. విసుగ్గా కుర్చీలో కూలబడుతుంది ఓ వీక్లీని అందుకుని శారద. ఇంతలో కాళ్ళీడ్చుకుంటూ వస్తాడు రాజారావు. అతడిని చూడగానే లోపలికి వెళ్ళి మంచి నీళ్ల తెచ్చిస్తుంది శారద. "ఏమండీ, కాస్త ముఖం కాళ్లు, చేతులు కడుక్కుని వచ్చారంటే కాఫీ ఇస్తాను. ఆ తర్వాత ఇద్దరం కలిసి అలా బైటికి వెళ్దాము." అడిగింది శారద.

''ఇప్పుడేగా ఇంటికి చేరింది? ఇప్పుడు మళ్ళీ బయటికి బయల్దేరే ఓపిక నాకు లేదు." రాజారావు అన్నాడు.

"అలా ఎగ్జిబిషన్ వైపు వెళ్ళి వద్దామండీ!"

'శారదా! ఇప్పుడు నన్ను ఇబ్బంది పెట్టకు,బయటికి కదలలేను." ప్రతిమాల్తున్నట్లన్నాడతను. మూతి తిప్పుతూ లోపలికి వెళ్ళిపోతుంది శారద. రాజారావు నీరసంగా వెనక్కి వాల్తాడు కుర్చీలో.

*　　　　*　　　　*

మర్నాడు వీళ్లు ముందు గదిలో వుండగానే ముందింట్లోంచి ఈశ్వర్, మయూరి బయటికొస్తారు. లోపలనుంచే వాళ్ళ మాటల్ని వింటుంటారు. "సాయంత్రం ఆఫీసైపోగానే వచ్చేస్తారుకదూ?" అడిగింది మయూరి.

"అయిదున్నరకల్లా రెక్కలు కట్టుకొనివచ్చి నీముందు వాల్తాను." వినమ్రాన్ని చూపిస్తూ అన్నాడు ఈశ్వర్. టాటాలు చెప్పుకుంటూ విడిపోతారు. ఎదురు గుమ్మం తలుపు వేసుకున్న తరువాత రాజారావు బయల్దేరతాడు. వెనకే బయటికి వచ్చిన శారద అడిగింది:

"సాయంత్రం అయిదున్నరకల్లా వచ్చేస్తారుగా?"

"ఇంకా నయం! ఆఫీసుకి శెలవు పెట్టి ఇంట్లో వుండిపొమ్మన్నావు కాదు. ఆఫీసులో బోల్డు పనుంది ఈ రోజు కాస్త ఆలస్యం కావచ్చు." రాజారావు కాస్త విసుగ్గా అన్నాడు.

రాజారావు వెళ్ళిపోతాడు. శూన్యంలోకి చూస్తూ అక్కడే నిల్చుండిపోతుంది శారద.

* * *

శారద, మయూరి ఇంట్లో లోపలి గదిలో మాట్లాడుకుంటూ వుండగా కాలింగ్ బెల్ మోగుతుంది. దూకుడంటూ వచ్చి తలుపు తీస్తుంది మయూరి. భర్తను చూస్తూ అడిగింది:

"ఏమిటండీ అలా వున్నారు?"

"రేపు సాయంత్రం కాంప్ కెళ్ళాలి."

"ఎన్నాళ్ళు?"

"నాలుగు రోజులు."

"అమ్మో! నాల్గురోజులే. నేను వంటరిగా వుండలేనండీ! మీతో వచ్చేస్తాను."

"నేను అదే అనుకుంటున్నాను. నిన్నొదిలి నేను మాత్రం వుండ గలనా? ఇద్దరం కలిసి వెళ్దాం. ఏదైనా హోటల్లో దిగుదాం. పగలల్లా ఆఫీసు సేవ, సాయంత్రం దేవిగారి సేవ "

"అలా చేస్తే ఆఫీసు పని మీద వెళ్ళినట్లే వుండదు. ఇంచక్కా హనీ మూన్ వెళ్ళినట్లుంటుంది."

ఇద్దరూ నవ్వుకుంటారు.

"ఇప్పుడెక్కడికైనా వెళ్దామా - ఏ సినిమాకైనా?" మయూరి అడిగింది.

"సినిమాకా? నే్రానను." ఈశ్వర్ అలక నటిస్తాడు.

"ఏం?"

మూడు గంటలసేపు నువ్వు నా ప్రక్కనున్నా వంటరితనాన్ని అనుభవిస్తూ కూర్చోలేను."

ఆమెని దగ్గరికి తీసుకోబోతాడు.

ముక్కుమీద వేలుంచి దూరంగా జరుగుతుంది.

"ష్.... శారదగారు లోపల గదిలో వున్నారు." భర్తని వారిస్తుంది మయూరి.

బుద్ధిమంతుడిలా సోఫాలో కూర్చుండిపోతాడు ఈశ్వర్.

మయూరి లోపలికి రాగానే శారద "మావారొస్తారు. నేను వస్తా నండీ...." లేస్తుంది.

"కాఫీ తాగి వెళ్దురుగాని." మయూరి అడిగింది.

"వద్దంతీ, ఆయన వచ్చే టైమైంది."

శారద వెళ్ళిపోతుంది.

"శారదా! ఇటురా...." కేకేస్తాడు ఈశ్వర్.

"నాకు చాలా పనులున్నాయి."

"ఇద్దరం కలిసి ఆడుతూపాడుతూ పని చేస్తుంటే...."

కాఫీ కప్పుతో వస్తూ మయూరి "స్వామీ, కాస్త మీ పాట ఆపండి. ఆడుతూ పాడుతూ ఇప్పుడేమీ పనిచేయనక్కర్లేదు. మీరు ఆఫీసునించి వచ్చేసరికే నేను పనంతా పూర్తి చేసుకున్నాను. ఈ కాఫీ తాగండి చాలు." బ్రతిమాల్తున్నట్లంటుంది.

"ఏమిటీ, నేనొక్కణ్ణేతాగాలా? వన్‌బైటు ప్లీజ్...." లాలనగా భార్యనడుగుతాడు ఈశ్వర్. అతని ప్రక్కన కూర్చుండిపోతుంది.

"ఒకే. గ్రాంటెడ్."

కాఫీ కప్పుని మయూరికి అందిస్తాడు. "లేడీస్ ఫస్ట్. ఫస్ట్ సిప్ నీది" అంటాడు ఈశ్వర్. ఆమె సిప్ చేస్తుంది.

* * *

రాజారావు వచ్చేసరికి శారద చికాకుగా వుంటుంది. "ఏమిటలా వున్నావు? ఆలస్యంగా వచ్చాననా?" అడిగాడు రాజారావు.

"ఈవిడకి భర్త ఇంటికొస్తే చాలు ఇంకెవ్వరూ గుర్తుండరు." చిరుకోపంతో అంటుంది శారద.

"వీళ్ళ అన్యోన్యం చూస్తుంటే ఆఫీసులో వున్నంత సేపు ఎలా విడివిడిగా వుండగల్గుతున్నారా అనిపిస్తుంది."

"ఇంట్లో వున్నా భర్తధ్యాసే. నాతో నాలుగు మాటలు మాట్లాడిందంటే అందులో రెండు భర్త గురించే. ప్రతిరోజూ అతనికోసం ఆఫీసుకి ఫోన్ చేస్తుంది అతనొకసారి ఫోన్ చేస్తాడట."

"ఆదర్శదాంపత్యం........" ముచ్చటపడతాడు రాజారావు.

* * *

ఆఫీసునుంచి వస్తూనే భార్యని గట్టిగా పిలుస్తాడు రాజారావు. "ఏమిటా కేకలు?" అంటూ అక్కడికొస్తుంది శారద.

"ఇలా కూర్చో, ఇవాళ నా మూడ్ పాడైపోయింది."

"నాకూ అలానే వుందండి!"

"సరిపోయింది. కారణమేమిటి?"

"ముందు మీ మూడ్ పాడవడానికి కారణం చెప్పండి,"

"ప్రొద్దున అతని వెనుకే ఆఫీసుకి బయల్దేరానా? దారిలో అతనికో స్నేహితుడు కలిసాడు...." అంటూ వాళ్ళిద్దరిమధ్యా జరిగిన సంభాషణ యధాతథంగా వివరించాడు.

నవీన్ : అరేయ్ ఈశ్వర్!

ఈశ్వర్ : అరె నవీన్! నువ్వా, ఇక్కడున్నావేమిటి?

నవీన్ : ఇక్కడ మా బాబాయి కూతురు పెళ్ళి. దానికని వచ్చాను.

ఈశ్వర్ : ఎక్కడుంటున్నావ్?

నవీన్ : చుండూరులో. ప్రశ్నలన్నీ నీవే అడగడమా - నన్నూ అడగనిస్తావా?

ఈశ్వర్ : అడుగు.

నవీన్ : నువ్వెక్కడ ఉంటున్నావ్?

ఈశ్వర్ : ఈ ఊళ్ళోనే ఉద్యోగం. ఉండేది ఈ వీధి చివర ఉన్న ఇల్లు.

నవీన్: ప్రక్క వీధిలో మా బాబాయిగారి ఇల్లు. ఫామిలీతో వచ్చాను

ఈశ్వర్ : ఇంకెన్ని రోజులుంటావిక్కడ?

నవీన్ : రేపుదయం వెళ్ళిపోదామనుకుంటున్నా.

ఈశ్వర్ : మా ఇంటికి రాకుండానే వెళ్తావా?

నవీన్ : ఇప్పుడాఫీసుకి వెళ్తున్నట్లున్నావ్‌గా, రాత్రికి వస్తాను.

ఈశ్వర్ : సారీ బ్రదర్! ఇవాళ సాయంత్రం క్యాంప్ కెళ్తున్నాను.

నవీన్ : నువ్వు లేకపోయినా మీ ఆవిడ ఉంటుంది కదా? మా ఆవిడతో నేను వచ్చి పలకరించి వెళ్తాను.

ఈశ్వర్ : ఆవిడ కూడా నాతో వస్తోంది బ్రదర్!

నవీన్ : అంటే, నువ్వు కాలేజీలో చదివే రోజుల్లో చెప్పిన మాటల్ని తు.చ. తప్పకుండా పాటిస్తున్నావన్న మాట?

ఈశ్వర్ : ఎప్పటికైనా అభిప్రాయం మారదు బ్రదర్! పాత్ర స్వరూపమునుబట్టి ద్రవ ఆకారం మారినట్లే, పరిసరాల్నిబట్టి స్త్రీ స్వభావం కూడా మారుతుంది. కాబట్టి మగవాడెప్పుడూ భార్యని కనిపెట్టుకుని తన పరిధిలోనే ఉండేలా చూసుకోవాలి. క్యాంప్‌కే కాదు నేను ఏ వూరు వెళ్ళినా తను వెంట ఉండాల్సిందే!

రాజారావు బాధపడతాడు.

"ఇతని మనస్తత్వం ఇలా ఉంటే ఆ అమాయకురాలు ఇదంతా నిజమైన ప్రేమని మురిసిపోతోంది."

"అంత జాలిపడకండి. గంతకు తగ్గబొంతే! మధ్యాహ్నం నా దగ్గరకు వచ్చింది...."

శారద చెప్పడం ప్రారంభిస్తుంది ఆవిడతో తన సంభాషణ.

శారద : ఏమిటీ! ఆయనతో పాటు మీరూ వెళ్తున్నారా క్యాంప్‌కి?

మయూరి : మీకు తెలీదు శారదగారూ! ఈ మగవాళ్ళున్నారు చూశారూ! వీళ్ళని నమ్మడానికి వీల్లేదు. పెళ్లాం పక్కన లేకపోతే ఎన్ని వెర్రి వేషాలు వేయడానికైనా వెనుకాడరు. పైగా, ఈ మనిషి కొంచెం అందంగా కూడా వున్నారేమో-కనిపెట్టుకుని వుండకబోతే నాకు దక్కరు.

"సరిపోయింది, దొందూ దొందే నన్నమాట!" ఆశ్చర్యపోయాడు రాజారావు.

"అవును- ఆదర్శ దాంపత్యం!" భర్త మాటల్ని గుర్తుకు తెస్తూ వ్యంగ్యంగా అంది శారద.

*